క్లుప్తంగా

పంటలకు నీరు విడుదల



కొండాపురం సమీపంలో జొన్న పొలానికి చేరిన నీరు

దొర్నిపాడు: వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జలాశయాల్లో అంతంత మాత్రమే ఉన్న నీటిని అధికారులు వారంబందీగా వదులుతున్నారు. ప్రస్తుతం కేసీ కాల్వకు నీటిని విడుదల చేయడంతో రైతులు జొన్న, పత్తి, మిరప, కంది పంటలకు నీటి తడులు పెడుతున్నారు. బెట్టపోయిన పంటలకు ఈ నీరు ప్రాణం పోసిందని రైతులు చెబుతున్నారు.

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

ఉయ్యాలవాడ: స్థానిక మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం నందవరం మోడల్‌స్కూల్‌లో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల చేపట్టిన పదోన్నతుల్లో భాగంగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న దాదాపీరా నాలుగు సంవత్సరాల క్రితం బదిలీపై రుద్రవరం మండలానికి వెళ్లారు. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నూర్జహాన్ కొనసాగారు. ఈయన రాకతో ఖాళీగానున్న ప్రిన్సిపాల్ పోస్టు భర్తీ అయ్యింది. అనంతరం ఆయన అధ్యాపకులతో సమావేశం నిర్వహించి పది, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఉయ్యాలవాడ మండలంలోని తుడుములదిన్నె గ్రామంలో దళిత కుటుంబానికి చెందిన శ్రీనివాసులు ఆత్మహత్యకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్, భాస్కర్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. శ్రీనివాసులు పొలం వద్ద మేకలు మేపుకుంటుండగా కొందరు దాడి చేశారని, ఘటనపై ఉయ్యాలవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. ఉద్దేశ పూర్వకంగా హింసించడంతోనే ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డాడని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే..బాధితుడి కుటుంబానికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు

దొర్నిపాడు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ తిరుపాల్ హెచ్చరించారు. గురువారం ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తే సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన రహదారిలో బస్‌స్టాప్‌ల వద్దనే ఆర్టీసీ బస్సులను ఆపాలని సూచించారు. అలాగే బస్టాండు లోకి బస్సులు వచ్చిపోయేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీఎంకు చెబుతామన్నారు. వాహనాలు వేగంగా వెళ్తుండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు.పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తీసుక వెళ్తే చర్యలు తప్పవన్నారు.

జయప్రదం చేయండి

చాగలమర్రి: వచ్చే నెల 7వ తేదీన తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, ఎంఈఎఫ్ తాలూకా నాయకులు ఘన మద్దిలేటి, తిరుపతయ్య పిలుపునిచ్చారు.గురువారం మండలంలోని మల్లెవేముల గ్రామంలో విశ్వరూప మహాసభకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఎంఆర్‌పీఎస్ గౌరవ అధ్యక్షుడు టీఎస్‌ఎల్ పుల్లయ్య, నాయకులు బాల ఓబన్న, నరసింహుడు, గడ్డ కిషోర్, రవి, ప్రకాష్ తదితరులున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు



గాయపడిన చంద్రశేఖర్ రెడ్డి

దొర్నిపాడు: మండల కేంద్రం శివారులోనున్న కేసీ కెనాల్ సమీపంలో టీ కొట్టు వద్ద టీ తాగుతున్న వ్యక్తిని కారు ఢీ కొట్టడంతో ఆయనకు గాయాలయ్యాయి. గురువారం ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు..డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం దొర్నిపాడుకు వచ్చి టీ కొట్టు వద్ద టీ తాగుతుండగా వేగంగా వచ్చి కారు ఢీ కొనడంతో గాయాలవడంతో చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. హైదరాబాదుకు చెందిన టీఎస్ 07హెచ్‌టీ9177 కారులో కొందరు యాగంటి క్షేత్రాన్ని దర్శించుకొని తిరుపతి వెళ్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. డ్రైవర్ చక్రపాణిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

దొర్నిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రం గురువారం ముగిసింది.కార్యక్రమంలో భాగంగా 4,186 మందికి వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. గుండుపాపలలో 560, కొండాపురంలో 564, చాకరాజు వేములలో 772, దొర్నిపాడులో 623, డబ్ల్యూ గోవిందిన్నెలో 520, బుర్రారెడ్డపల్లెలో 582, క్రిష్టిపాడులో 565 మందికి వైద్యం అందించినట్లు చెప్పారు.

చాగలమర్రి: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని పెద్ద బోధనం గ్రామ సర్పంచ్ ముడియం శివమ్మ, చిన్న బోధనం గ్రామ సర్పంచ్ యామ లక్ష్మీనరసమ్మ పేర్కొన్నారు. ఎంపీడీఓ మహబూబ్ దౌలా, సచివాలయ కార్యదర్శి సబియా ఆధ్వర్యంలో పెద్ద బోధనం సచివాలయ ఆవరణంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పెద్ద బోధనం సచివాలయ పరిధిలోని పెద్ద బోధనం, చిన్న బోధనం, తిప్పనపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు తరలి రావటంతో వైద్య శిబిరానికి చివరి రోజు కూడా విశేష స్పందన లభించింది. శిబిరంలో స్త్రీ వ్యాధుల వైద్య నిపుణులు డాక్టర్ రాధికా జ్యోతి, గుండె సంబధిత వైద్య నిపుణులు డాక్టర్ శబరీష్ , ఫిజీషియన్లు డాక్టర్ అంజలి, డాక్టర్ శివమోహన్, కంటి వైద్య సహాయకురాలు సౌజన్య వైద్య సేవలు అందించారు. శిబిరంలో సూమారు 428 మంది ఓపీ నమోదు చేసుకోగా వారిలో 197 మంది మహిళలు, 231 మంది పురుషులు, 26 మంది చిన్నపిల్లలు, 104 మంది కంటి వైద్య సేవలు పొందారు. వీరిలో 10 మందిని కంటి శుక్లాల శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. సుమారు 174 మందికి రక్త పరీక్షలు నిర్వహించారని టీం-2 వైద్యులు పి.అంజలి తెలిపారు. అలాగే మెరుగైన వైద్య సేవల కోసం 12 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆసుపత్రులకు సిఫారసు చేశామన్నారు. సు మారు 24 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామని చెప్పారు. ఈ సందర్బంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ముడియం చిన్న నాయుడు, ఎంపీటీసీ నరసింహుడు, యామ బాలకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఫార్మాసిస్ట్ రాజేష్, సీహెచ్‌ఓ భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీలమ్మ పాల్గొన్నారు.





కొండాపురంలో వృద్ధ దంపతులను వైద్య శిబిరానికి తీసుకొస్తున్న సర్పంచ్ మాధవీలత,పెద్దబోధనంలో ప్రజలకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ పి.అంజలి



పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాస్

నేడు వైద్య శిబిరం

శిరివెళ్ల: ఈ నెల 27వ తేదీన స్థానిక 4వ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సరక్ష వైద్య శిబిరం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం ఉంటుందని, ఇప్పటికే సచివాలయ పరిధిలో ఇంటింటికీ వైద్య సిబ్బంది తిరిగి ప్రాథమిక పరీక్షలు చేశారన్నారు. శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నంద్యాల టౌన్: అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని వైద్యాధికారులు సభాబేగం, చంద్రకాంత్ అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీ, హరిజనవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఎన్జీవో కాలనీ శిబిరంలో 812 మందికి వైద్యం అందించామని వారిలో 30మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ హాస్పిటల్‌కు రెఫర్ చేశామని వైద్యాధికారి చంద్రకాంత్ తెలిపారు. అలాగే హరిజన వాడలో ఏర్పాటు చేసిన శిబిరంలో 520 మందికి వైద్యసేవలు అందించామని వారిలో 9 మందిని మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ హాస్పిటల్ కు రెఫర్ చేశామని వైద్య అధికారి సభా బేగం చెప్పారు.

స్టేట్‌బ్యాంకులో అగ్ని ప్రమాదం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో గురువారం వేకువజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఫైర్ ఆఫీసర్ యోగీశ్వరరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌బీఐ బ్యాంక్‌లో తెల్లవారుజామున మంటలు చెలరేగి పొగలు రావడాన్ని సెక్యూరిటీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఫైర్ సిబ్బందికి సమచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి ఫైర్ ఇంజన్లతో సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారని చెప్పారు. అగ్ని ప్రమాదంలో ఒక ఏసీ, కంప్యూటర్ , కొన్ని రికార్డులు దగ్ధమయ్యాయని, షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు.

కోలుకోలేక యువకుడి మృతి

శిరివెళ్ల: మండలంలోని బోయలకుంట్లకు చెందిన బీరవోలు ఫరూక్ (21) కర్నూల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ సురేష్ గురువారం తెలిపారు. ఈ నెల 24న ఫరూక్ తన స్నేహితుడు మాబాషాతో కలిసి ఆటోలో పాత ఇనుప సామాను వ్యాపార నిమిత్తం గాజులపల్లెకు వెళ్లారు. పని ముగించుకుని తిరిగి రాత్రి వేళ వస్తుడంగా బోయలకుంట్ల నుంచి గాజులపల్లెకు వెళ్తున్న ఆటో బోయలకుంట్ల కాశిరెడ్డి నాయన ఆశ్రమం వద్ద వేగంగా వచ్చి వారి ఆటోను ఢీకొట్టింది.దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ఫరూక్ పరిస్థితి విషమించడంతో మెరిగైన వైద్యం నిమిత్తం కర్నూల్‌కు తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. తండ్రి జబ్బారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

ఈ–క్రాప్ నమోదుతోనే పరిహారం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

రుద్రవరం: సాగు చేసిన ప్రతి పంటను ఈ–క్రాప్ నమోదు చేయడంతోనే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోతే పరిహారం వర్తిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం ఆయన కోటకొండ, యల్లావత్తుల, చిన్నకంబలూరు, పెద్ద కంబలూరు, రుద్రవరం రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్ 2023 ఏడాదికి సంబంధించి ఈ–క్రాప్ జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటల నమోదు పూర్తయిందని, ఈనెల 26 నుంచి 29 వరకు జాబితా ఆఆర్‌బీకేలో అందుబాటులో ఉంటుందన్నారు. పంట విస్తీర్ణం, వివరాలు, ఏమైనా పొరపాట్లు ఉంటే అర్జీ రూపంలో అందజేయాలన్నారు. అనంతరం గ్రామ సభలో రైతుల పేర్లను చదివి వినిపించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నయ్య, రామ్మోహన్‌రెడ్డి, టెక్నికల్ ఏఓ నాగేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ, ఏఈఓ రాజు, కార్యదర్శులు షాహినూర్, పాములేటి, కళావతి, గ్రామ సర్పంచులు వెంకటేష్, చెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ఉయ్యాలవాడ పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు రికార్డులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

ఉయ్యాలవాడ : పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఏపీ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు, పోలీసుల విధులు, వైర్‌లెస్ సెట్, తుపాకులు, దిశ చట్టంపై వారికి అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అయోడిన్ లోపంతో అనర్థాలు



మాట్లాడుతున్న ఖాసింవలి

నంద్యాల(సిటీ): మానవుని శరీరంలో అయోడిన్ తప్పనిసరిగా ఉండాలని, అయోడిన్ లోపంతో ఎన్నో రకాల వ్యాధలు వస్తాయని ఆహార భద్రతాధికారి ఎస్.ఖాసింవలి తెలిపారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వెంకటరాముడు ఆధ్వర్యంలో గురువారం నూనెపల్లెలో పట్టణంలోని ఉప్పు వ్యాపారులు, కిరాణం రిటైల్ యజమానులకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21 నుంచి 27వ తేదీ వరకు అయోడిన్ ఉప్పుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అయోడిన్ ఒక రసాయన మూలమని, అయోడైజ్ ఉప్పుతో శరీరానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అయోడిన్ శాతం శరీరంలో తగ్గితే బుద్ధిమాంద్యం, చిన్నారుల్లో మానసిక ఎదుగదల లోపం వంటివి వస్తాయన్నారు. అంతే కాకుండా థైరాయిడ్ హార్మోన్ల సంశ్లేషణకు అవసరమైన ముఖ్య మూలంగా అయోడిన్ పని చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారపదార్థాలలో డబ్ల్యూహెచ్‌ఓ సూచించిన అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించాలని కోరారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు కోరారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని, పీఎఫ్ లోన్స్, ఏపీజీ, ఎల్‌ఐసీ రుణాలు మంజూరు చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద జీతాలు చెల్లించాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు ఎంటీఎస్ అమలు చేసి అరియర్స్ చెల్లించాలని, ప్రత్యేక హాస్టల్ వార్డెన్‌లను నియమించాలని, సరెండర్ లీవ్ నగదు ఖాతాలో జమ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 12నెలల వేతనం చెల్లించాలని, జీపీఎస్ వల్ల ఉపయోగం లేదని, ఓపీఎస్ అమలు చేయాలన్నారు.ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలన్నారు. విజయరావు, నరసింహులు, భాస్కరరెడ్డి, జగదీష్, చెన్నుడు, సుమయూన్, శంకర్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

ఆళ్లగడ్డ: మండలంలోని జి.జంబులదిన్నె, ఓబుళంపల్లి గ్రామాల్లో సాగుచేసిన జొన్న, మిరప పంటలను జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు గురువారం పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటల స్థితిగతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్–2023కు సంబంధించిన ఈ–క్రాప్ నమోదు వివరాలను ప్రదర్శించారు. ఏడీఏ చెన్నయ్య, ఏఓ కిశోర్ కుమార్‌రెడ్డి, ఏఈఓ ఉశే న్‌బాషా, వీఏఏలు షాహినా, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

శిరివెళ్ల: జిల్లాలో ఈ–క్రాప్ బుకింగ్‌పై సామాజిక తనిఖీ ప్రారంభమైందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. గురువారం మహదేవపురం రైతు భరోసా కేంద్రంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల జాబితాను పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు 2023 ఖరీఫ్‌లో సాగైన పంటలపై ఆర్‌బీకేల్లో క్రాప్ బుకింగ్ వివరాల ముసాదా జాబితాను ప్రదర్శిస్తారన్నారు. రైతులు, సాగు చేసిన పంటలు, విస్తీర్ణం తదితర వివరాలు జాబితాలో పేర్కొన్నామన్నారు. రైతులు జాబితాను పరిశీలించి తప్పులుంటే తెలియజేయాలని సూచించారు. అభ్యంతరాలను విచారణ చేసి తుది జాబితాను ప్రదర్శిస్తామని చెప్పారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓ సుధాకర్, సర్పంచు పెద్ది రమణయ్య ఉన్నారు.



జొన్న పంట పొలంలో రైతు నుంచి వివరాలు సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నేడు ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పర్యటన

దొర్నిపాడు: మండలంలో శుక్రవారం ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వర రావు గురువారం తెలిపారు. కేసీ కెనాల్ వెంట పర్యటించిన అనంతరం వెలుగు కార్యలయంలో జరిగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

గోస్పాడు: వరి పైరులో రైతులు సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణ అధికారి బాల నరసింహులు తెలిపారు. మండలంలోని ఒంటివెలగల గ్రామంలో గురువారం వరి పైరును పరిశీలించి ఆయన మాట్లాడుతూ.. పంట సాగులో రైతులు సరైన మెళకువలు పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల పంటకు నష్టం చేకూరుతుందన్నారు. యూరియా, పోషక పదార్థాల వాడకం గురించి వివరించారు. ఆర్‌బీకేలో రైతులకు అవసరమైన వ్యవసాయ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ- క్రాప్ నమోదులో తప్పులను సరి చేసుకోవచ్చు

నంద్యాల(అర్బన్): ఖరీఫ్ – 2023కు సంబంధించి ఈ–పంట నమోదు చేసుకున్న రైతుల వివరాల్లో తప్పులు ఉంటే ఈనెల 29లోగా సరిచేసుకొనే అవకాశం ఉందని నంద్యాల మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. సామాజిక తనిఖీ నిమిత్తం సంబంధిత ఆర్‌బీకే కేంద్రాల్లో ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను ప్రదర్శనకు ఉంచామన్నారు. నంద్యాల మండలం పులిమద్ది గ్రామ ఆర్‌బీకే కేంద్రాన్ని గురువారం ఏఓ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ఆర్‌బీకే నోటీసు బోర్డులో ఉంచిన జాబితాను రైతులతో కలిసి పరిశీలించారు. ఏఈఓ మనోహర్, సహాయకులు సురేష్ రెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోండి

నంద్యాల టౌన్ : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ముఖ్య ప్రాంతాలకు కార్గో సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు వినియోగించుకోవాలని నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ పార్సిల్ డోర్ డెలివరీ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 26 నుంచి నవంబర్ 25వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

30న టెంకాయల విక్రయానికి వేలం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీ ప్రథమ నందీశ్వరస్వామి దేవస్థానంలో 2023–24 సంవత్సరానికి గాను టెంకాయల విక్రయానికి వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 30వ తేదీ సాయంత్రం 4గంటలకు దేవాలయ ఆవరణలో టెంకాయలు అమ్ముకునేందుకు దేవదాయ శాఖ అధికారి సమక్షంలో బహిరంగ వేలం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ 14 నుంచి 2024 కార్తీక మాసం ప్రారంభం వరకు కాల పరిమితి ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించలన్నారు.

28న 'మద్దిలేటి' ఆలయం మూసివేత

బేతంచెర్ల: ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయాన్ని ఈనెల 28వ తేదీ సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం చంద్రగ్రహణం సందర్బంగా మూసి వేస్తున్నట్లు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమి శనివారం తెల్లవారితే ఆదివారం ఉదయం 1:05 నుంచి 2:22 నిమషాల వరకు రాహుగ్రస్త పాక్షిక చంద్ర గ్రహణం ఉందన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆలయ సంప్రోక్షణ అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు.

ఐఎంఏ నంద్యాల మహిళా విభాగం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మహిళ విభాగం సభ్యులు

నంద్యాలటౌన్: ఐఎంఏ నంద్యాల శాఖ మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో నంద్యాల ఐఎంఏ మహిళా విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ కల్పన, కార్యదర్శిగా డాక్టర్ సరిత ఎన్నికయ్యారన్నారు. కోశధికారిగా లలిత, ఉపాధ్యక్షులుగా నెట్ల శిల్పా, ప్రియదర్శిని, కార్యవర్గ సభ్యులుగా షబ్నం, మల్లీశ్వరి, హర్షిణి, సాయి హరీష, కీర్తి రెడ్డి, సునీత, కృష్ణవేణి, క్రాంతి, కావ్య, అనూష ఎన్నికయ్యారని చెప్పారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి

ఆత్మకూరు: పొదుపు సంఘాల మాదిగానే రైతులకు సంబంధించి ప్రతి మండలంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరిన్ని ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం పొదుపు సంఘాల సభ్యులతో, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు సంఘాలు ఏర్పాటు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చేలా రైతులకు సంబంధించి ప్రకృతి వ్యవసాయం వైపు వారిని తీసుకువెళ్లే అవకాశం ఉందన్నారు. రైతుల సాధికారిత సంస్థల వలన ఏ పనులు చేస్తున్నారో తదితర అంశాలను డీపీఎమ్ సురేష్ వివరించారు. అనంతరం పీడీ గ్రామైఖ్య సంఘాల పుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏసీ పుల్లయ్య, ఏబీఎం ఉమామహేశ్వరమ్మ, అనురాధ, సీసీలు వెంకటరమణ, జ్యోతి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మేదినీపూర్ ఎంపీ



ప్రధానాలయ రాజగోపురం వద్ద ఎంపీకి ఆహ్వానం పలుకుతున్న అధికారులు

శ్రీశైలం: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను వెస్ట్‌బెంగాల్లోని మేదినీపూర్ ఎంపీ దిలీప్ ఘోష్ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం,అ మ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చక వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు అందజేశారు.

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలం:లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేష పూజలను దేవస్థానం ఈఓ పెద్దిరాజు, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాధి, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పట్టుదలతోనే విజయాలు

మహానంది: కష్టపడేతత్వం, కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను నెరవేరుతారని, అందుకు నందిపల్లెకు చెందిన మనీషారెడ్డి ఐపీఎస్‌గా ఎంపిక వడం నిదర్శనమని వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ, టీఎస్ హ్యూమన్‌రైట్స్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. నందిపల్లె గ్రామానికి చెందిన మనీషారెడ్డి ఐపీఎస్‌గా ఎంపిక కావడంతో ఆమె స్వగ్రామానికి వెళ్లి గురువారం అభినందించారు. రైతు కుటుంబానికి చెందిన సాగేశ్వరరెడ్డి మనవరాలు ఐపీఎస్‌గా ఎంపికవడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఐపీఎస్ మనీషారెడ్డి తండ్రి రాజురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహర్షి వాల్మీకి పాటల సీడీ ఆవిష్కరణ

డోన్ : రామయణ మహా కావ్యం మానవుని నిత్య జీవత నడవడికను నిర్దేశిస్తుందని వాల్మీకి సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, వీఆర్‌పీఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వలిసెల రామకృష్ణ అన్నారు. స్థానిక వాల్మీకి విగ్రహం వద్ద గురువారం ప్రముఖ చెక్క భజన కళాకారుడు రాంపల్లె శ్రీను గానం చేసిన వందనాలయ్య వాల్మీకి అనే పాటల సీడీని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం వాల్మీకి విగ్రహం వద్ద ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించిందని, వాల్మీకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పాటల సీడీని ప్రజల ముందుకు తీసుకొచ్చిన సంగాల శీనయ్య, గుమ్మకొండ చిన్న హనుమన్న, విక్రం,అంజి, వెంకట్రాముడులతో పాటు వ్యాఖ్యాత ఈశ్వరరెడ్డిని వారు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఉంగరానిగుండ్ల చిన్నమద్ది, కౌన్సిలరు ఆర్ట్ రమణ, శివరామకృష్ణ, అశోక్, వెంకట్రాముడు, పాలరాజు, మిద్దెపల్లె గోవిందు, జయరాముడు, ఆర్మీ రామయ్య, పెద్దయ్య, మహేంద్ర పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గొర్రెకు శస్త్ర చికిత్స



అంబులెన్స్‌లోనే శస్త్రచికిత్స చేసి గొర్రె పిల్లను బయటికి తీస్తున్న పశువైద్యులు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని మూగ జీవాలకు సైతం వైద్యం అందించేందుకు, అత్యసరసమయాల్లో వాటిని పశువైద్యశాలకు తరలించేందుకు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా పశువులను తరలించేందుకు ప్రత్యేక అధునాత వైద్యపరికరాలతో కూడిన అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచింది. 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌చేస్తే చాలు వాహనంతో పశువైద్యులు చేరుకొని వైద్య సేవలు అందిస్తున్నారు. మండలంలోని శివపురం గ్రామంలో నరసింహనాయుడు అనే వ్యక్తికి 100 గొర్రెలు ఉన్నాయి. అందులో ఒక గొర్రె మూడురోజుల నుంచి ఈత ఈనలేక ఇబ్బంది పడుతోంది. రైతుల సహయంతో ఆయన వెంటనే మండల పశువైద్యాధికారిణికి, 1962 టోల్‌ఫ్రీ ద్వారా అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గురువారం పశువైద్యులు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవ వాహనంతో గ్రామానికి చేరుకొని అందులోనే గొర్రెకు శస్త్ర చికిత్స చేసి, కడుపులోనే చనిపోయిన పిల్లను బయటికి తీశారు. గొర్రె ఆరోగ్యం ప్రస్తుతానికి బాగానే ఉందని రైతన్న ఆనందం వ్యక్తం చేశారు. రైతులు, పశువుల యజమానులు వైఎస్సార్ పశుసంచార ఆరోగ్య సేవ వాహనం సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ భువనేశ్వరి కోరారు.